# రాబందుల రాజ్యం

# కామందుల ... భోజ్యం



## ఆక్రమణలకు ప్రోత్సాహమా?

ప్రభుత్వం ఫిబ్రవరి 16వ తేదీన జారీ చేసిన 166 నెంబరు జీవో సర్కారు భూముల ఆక్రమణలను మరింత ప్రోత్సహించేదిగా ఉంది. పైగా ఇది బడుగువర్గాలకు కాకుండా పెద్ద విస్తీర్ణంలో భూమిని కైవసం చేసుకొన్న పెద్దలకు బాగా ఉపయోగపడుతోంది. ఇలా పెద్దలకు ప్రయోజనం కలిగించటం కోసమే 2003 వరకు హస్తగతం చేసుకొన్న భూములన్నింటికీ ఈ జీవో ద్వారా ఆమోదముద్ర వేస్తున్నారు. గతంలో ఇటువంటి స్థలాల క్రమబద్ధీకరణకు తొమ్మిది సార్లు జీవోలు వెలువడగా ఆక్రమణ అనేది 1990కి ముందు జరిగి ఉండాలని వాటన్నింటిలోనూ నిర్ధేశిస్తూ వచ్చారు. అటువంటి దాన్ని ప్రభుత్వం ఏకంగా 13 ఏళ్లు ముందుకు జరిపేసింది. పేదలకు ఉచితంగా క్రమబద్ధీకరించే స్థలాన్ని 80 గజాలకు తగ్గించేశారు. గతంలో ఈ పరిమితి నగరాల్లో 120 గజాల వరకు ఉండేది. పెద్దలకు మాత్రం రుసుం చెల్లిస్తే ఎంత విస్తీర్ణమైనా ధారాదత్తం అయ్యేలా మార్పులు చేశారు. గతంలో కట్టడం ఎంత విస్తీర్ణంలో ఉంటే అంతకు రెట్టింపు ఖాళీ స్థలాన్ని మాత్రమే క్రమబద్ధీకరించేవారు. దాన్ని ఇప్పుడు మార్చివేశారు. దీన్నిబట్టి ప్రభుత్వం ఎవరి పక్షమో.. ఈ ఉత్తర్వు ఎందుకిచ్చిందో ఇట్టే గ్రహించొచ్చు. ఇటీవలి ఆక్రమణలకు కూడా ఆమోదాన్ని తెలపటం వల్ల కనిపించిన స్థలాన్నల్లా కబ్జారాయుళ్లు తమ అధీనంలోకి తెచ్చుకొని దాన్ని 2003కి ముందే ఆక్రమించుకొన్నట్టుగా ఏదో ఒక రుజువును సృష్టించటానికి పెద్ద కష్టమేమీ కాబోదు. సొమ్ము కోసం ఇలా ప్రభుత్వమే ఆక్రమణలను ప్రోత్సహించటం దారుణం.

అక్రమాలు జరగకుండా చూడటం సర్కారు విధి. ఎక్కడైనా అటువంటివి ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవటం, అవి పునరావృతం కాకుండా చూడటం దాని బాధ్యత. ఆదాయమే పరమార్ధంగా భావిస్తున్న ప్రభుత్వం ఇప్పుడివేమీ పట్టించుకొనే స్థితిలో లేదు. అందుకే.. అక్రమాల క్రమబద్ధీకరణే తన ఏకైక లక్ష్యంగా పెట్టుకొని ఎడాపెడా జీవోలు ఇచ్చుకొంటూ వెళ్తోంది. క్రమబద్ధీకరణ పేరుతో భారీగా రుసుములు విధించి ప్రజల నడ్డి విరుస్తోంది. జీవోల ముసుగులో కొందరు పెద్దలకు లబ్ధి చేకూర్చటం ఉండనే ఉంది. ఇటువంటి ఉత్తర్వులు భవిష్యత్తులో మరిన్ని ఆక్రమణలకు ఊతమిస్తాయి. ప్రభుత్వం నిర్ధేశిస్తున్న భారీ రుసుములు అవినీతిని పోషించే ప్రమాదముంది. పట్టణాల్లో నిబంధనలు ఉల్లఘించిన నిర్మాణాలను, 2003వరకు ఆక్రమించుకొన్న ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరించటానికి వెలువరించిన జీవోలు ప్రధానమైనవి. పట్టణ భూగరిష్ఠ పరిమితి(యుఎల్‌సీ) చట్టంపరిధిలోని భూములకూ పరిమితి లేకుండా ఆమోదాన్ని తెలిపేందుకు ప్రభుత్వం త్వరలో తెరతీయబోతోంది.

ప్రజలకు నొప్పి కలిగించే ఉత్తర్వును వెలువరించాలంటే అంతకంటే బాగా బాధపెట్టే జీవోనొకదాన్ని తొలుత జారీ చేసి మొసలికన్నీరు కార్చాలి. ఇదే ప్రస్తుత సర్కారు విధానం. పట్టణాల్లో అక్రమ నిర్మాణాలకు ఆమోదముద్ర వేయటం కోసమంటూ చేపట్టిన తంతుయావత్తూ ఇలాగే సాగింది. అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణకు తొలుత వెలువరించిన జీవోలు చాలా భారంగా ఉన్నాయని, ముఖ్యమంత్రి వాటిని సమీక్షించి కొన్ని రాయితీలు ఇవ్వాలంటూ ఆదేశించారని జనవరి 31వ తేదీన రెండోసారి ఉత్తర్వులు వెలువరించినప్పుడు పురపాలక శాఖ మంత్రి ప్రకటించారు. ఏదో అత్యవసరమైట్టు భారీ జరిమానాల కోసం చట్టాన్ని గవర్నరు ఆర్డినెన్సు ద్వారా సవరించిన సర్కారుకు.. తానిచ్చే జీవోల వల్ల ప్రజలు ఇబ్బంది పడతారనేది తొలుత తెలియలేదంటే ఆశ్చర్యమే. విషయమేమిటంటే రెండోసారి వెలువరించిన జీవోలూ భారీ రుసుములు, జరిమానాలతో ప్రజల్ని పీడించేవిలా ఉన్నాయి. అన్ని చోట్ల నిరసన ధ్వనులు వినిపిస్తూనే ఉన్నాయి. వాటిని తేలికచేసి చెప్పటం కోసమే తొలిజీవోలను మరింత కఠినంగా ఇచ్చి ఆ తర్వాత ముఖ్యమంత్రి చెప్పారంటూ వాటిని ఉపసంహరించుకొన్నారు. భారీ జరిమానాలను ఆర్డినెన్సు ద్వారా అమల్లోకి తెచ్చిన సర్కారు నిబంధనలకు అనుగుణంగా చట్టసవరణ బిల్లును మార్చి 18వ తేదీన శాసనసభలో ప్రవేశపెట్టింది. భారీ జరిమానాలు దుర్మార్గపు చర్యగా ప్రతిపక్షాలు ధ్వజమెత్తాయి. ఓటింగులో తనకున్న మెజార్టీ ద్వారా ప్రభుత్వం ఈ బిల్లుకు ఆమోదముద్ర వేయించుకోగలిగింది. భవిష్యత్తులో ఎవరూ అక్రమాలకు పాల్పడకుండా ఉండటం కోసమే భారీ జరిమానాలు విధిస్తున్నట్టు పురపాలక శాఖ మంత్రి కోనేరు రంగారావు చెప్పారు. నిజానికి నిబంధనలకు విరుద్ధంగా అపార్టుమెంట్లను నిర్మించే గుత్తేదార్లు వాటిని అమ్ముకొని ఎప్పుడో కనుమరుగవుతారు. వాటిని కొన్న వారిపైనే జరిమానాల భారం పడుతుంది. భారం మోసేది కొనుగోలుదారులైనప్పుడు మంత్రి పేర్కొన్నట్టు అక్రమ నిర్మాణాలు ఎలా తగ్గుతాయి? ఇది అమాయక ప్రజల నడ్డివిరిచి వారి నుంచి సొమ్మును గుంజటం కాదా? ఇంతేసి భారీ జరిమానాల వల్ల అధికారులు ప్రజల్ని భయపెట్టి పెద్ద మొత్తాల్లో ముడుపులు వసూలు చేసే ప్రమాదం పొంచివుంది. ముడుపులు తీసుకొని చూసీచూడనట్టుగా వదిలివేస్తున్నందునే అక్రమ నిర్మాణాలు ఎక్కువవుతున్నాయి. వాటిని కొనుక్కొన్నవారికి కాకుండా ఇలా బాధ్యతలను విస్మరించినవారికి జరిమానాలు విధిస్తే సమస్య ఇట్టే పరిష్కారమవుతుంది. సర్కారు ధ్యాసంతా సొమ్ముపై ఉండటం వల్లనే అధికారులపై కాకుండా ప్రజలపై భారం మోపుతోంది. యుఎల్‌సీ భూముల క్రమబద్ధీకరణ పేరుతో ప్రభుత్వం త్వరలో మధ్యతరగతి వారిపై భారాన్ని మోపనుంది. వారి నుంచి రుసుముల రూపేణా భారీగా దుండుకోవటానికి సన్నాహాలు చేస్తోంది. చట్టం రద్దయితే ఇక సమస్యల నుంచి బయటపడవచ్చని యుఎల్‌సీ స్థలాలుగా తెలియక ఎప్పుడో కొనుగోలు చేసుకొన్న మధ్యతరగతి కుటుంబాలు ఆశగా ఎదురు చూస్తున్నాయి. చట్టాన్ని రద్దుచేసిన తర్వాత కూడా కొంత గడువు ఇచ్చి రుసుం ద్వారా వాటిని క్రమబద్ధీకరించాలని, గడవులోగా ముందుకురాని వారి స్థలాలను వేలంద్వారా విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. విశేషమేమిటంటే- స్థలాలు ప్రభుత్వ పరం కాకుండా చూసుకోవటం కోసం కోర్టుకు వెళ్లిన యజమానులు చట్టం రద్దుతో బయటపడగలుతున్నారు. భూములు వారిపరమవుతాయి. ఎటొచ్చి అటువంటివారి నుంచి అమాయకంగా ఇంటి స్థలాలను కొనుక్కొన్నవారే బలిపశువులవుతున్నారు. సర్కారు ఆధీనంలో ఉన్న భూములపై మాత్రమే క్రమబద్ధీకరణ పేరుతో రుసుము గుంజే అధికారం ఉంటుంది కనుకనే 11,557 ఎకరాలు స్వాధీనమైపోయినట్టుగా అధికారులు రికార్డుల్లో నమోదు చేశారు. అనేక ఏళ్ల క్రితమే ఇళ్లను నిర్మించుకొని కాపురాలు ఉంటున్న వారి స్థలాలు వీటిలో ఉన్నాయి.

క్రమబద్ధీకరణ అనేది ఇప్పుడు ప్రభుత్వానికి ఇక తారకమంత్రమయ్యింది. సొమ్ము వస్తుందంటే ఇప్పుడు దేనికైనా దాన్ని జపించటానికి సంసిద్ధమవుతోంది. హైకోర్టు స్టే ఇవ్వబట్టికాని లేకుంటే ఈపాటికి పేదల అసైన్డు భూములుకూడా పెద్ద ఎత్తున పరులపరమై ఉండేవి. ప్రభుత్వం వెలువరించే పలు ఉత్తర్వులు అల్పాదాయ వర్గాలకు కాకుండా ధనికులకే బాగా ఉపయోగపడుతున్నాయి. సన్న, మధ్యతరహా రైతులు భూముల క్రయవిక్రయాలను తెల్లకాగితాలపై రాసుకొని ఉంటే అటువంటి వాటికి ఆమోదముద్ర వేయాల్సిన అవసరాన్ని కోనేరు రంగారావు కమిటీ చాలా గట్టిగా చెప్పింది. ప్రభుత్వం ఇందుకు సంబంధించి జీవోను ఇచ్చినా ఆ విషయంపై ఎటువంటి ప్రచారం చేయలేదు. దీంతో మార్చి నెలాఖరుకు జీవో గడువు పూర్తియిపోతోంది. ఇటువంటి ఉత్తర్వును గతంలో కూడా ఇచ్చినా ప్రచారలోపం వల్లనే బడుగు రైతులెవరూ ముందుకు రాలేకపోయారని కోనేరు కమిటీ తన నివేదికలో తేటతెల్లంచేయగా ప్రభుత్వం మళ్లీ అదే తీరు కనబర్చింది. రాతకోతలనాటి రిజిస్ట్రేషన్ ఛార్జీలను వసూలు చేసి ఆయా భూముల వివరాలను పుస్తకాల్లో రాయటానికి రెవెన్యూ అధికారులు కొంత కసరత్తు చేయాల్సి ఉంటుంది. ఇదేమీ లాభసాటి వ్యవహారం కాకపోవటం వల్లనే వారు పెద్దగా ఆసక్తి కనబర్చటం లేదు. భూముల విలువలు బాగా పెరిగి రిజిస్ట్రేషన్ ఛార్జీలు తడిసి మోపెడవుతుండటం వల్ల గ్రామాల్లో తెల్లకాగితాల రాతకోతలు ఎక్కువవుతున్నాయని కొద్ది నెలల క్రితం జాయింట్ కలెక్టర్ల సమావేశం తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. చిన్న, మధ్యతరహా రైతులకు ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేయటమే పరిష్కారమార్గంగా సూచించింది. ఇలా చేస్తే రిజిస్ట్రేషన్ల ఆదాయం తగ్గిపోతుందంటూ సిఫార్సును ప్రభుత్వం తిరస్కరించింది. అంటే ఆర్థిక భారంతో రైతు రిజిస్ట్రేషన్లు చేయించుకోకపోయినా ఫర్వాలేదుకాని ప్రభుత్వం మాత్రం మెట్టుదిగదన్నమాట. పోని.. కోనేరు కమిటీ సిఫార్సు మేరకు వెలువరించిన జీవోనైనా అమలు చేసిందా? అంటే అదీలేదు. ఇదే రైతుల నుంచి భారీగా సొమ్ము వచ్చేలా ఉంటే మాత్రం పట్టణాల్లోని అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణ జీవోల మాదిరిగా ప్రచారాన్ని కల్పించిఉండేది. రిజిస్ట్రేషన్లు చేయించుకోకపోవటం వల్ల రైతుకు పట్టాదారుపాస్ పుస్తకాలు అందవు. ఇవి లేకుంటే బ్యాంకు రుణాలు కాని, వ్యవసాయ రాయితీలు కాని లభించవు. ఆక్రమణలను క్రమబద్ధీరించటానికి వెలువరించే ఏ ఉత్తర్వైనా సరే సర్కారు చిత్తశుద్ధిని, నిజాయితీని ప్రతిఫలించేలా ఉండాలి. బడుగు, మధ్యతరగతి వర్గాలకు అవి ఉపశమనం కలిగించగలగాలి. భవిష్యత్తులో అది మరిన్ని ఆక్రమణలను ప్రేరేపించేదిగా ఉండకూడదు. దురదృష్టవశాత్తూ సర్కారు ఇచ్చే ఉత్తర్వులన్నీ ఖజానాను నింపేవిగాను, కబ్జాదార్లకు, ఇతర పెద్దలకు ఉపయోగపడేవిగాను ఉంటున్నాయి.

**- పిళ్లా సాయికుమార్**